క. రతనంబు నింగలమునకు
జతగూర్చు, మరాళిఁ గాకి జతఁగూర్చు నొకో?
హతవిధి సృష్టి రహస్యము
సుతరామును గాదు మాదృశుల కెఱుఁగంగన్. ౫౫

క. పిడుగడచిన వసువున నా
పడఁతుక మూర్ఛిల్లి పెద్ద పలవించుచు నా
నుడి వినిన గడియ నుండియుఁ
దొడుగదుఁ బాయదును గట్టదును వింటె? హాకీ! ౫౬

క. తన క్రీడారామమునకుఁ
జని లతికామంటపమున శశికాంతశిలా
సనమున రాలిన పుష్పం
బన సంగిను ముడిచి మ్లానస్రగ్వి కూర్చుండెన్. ౫౭

చ. కడుఁగడు బాష్పముల్ విడుచుఁ గంటికి మంటికి నేకధారగా;
విడుచును వేఁడి యూర్పులను బెద్దగఁ, జిత్తము మందు చిచ్చునం
బడినదివోలెఁ, గంభీరమగు గాఢనదున్; హాసియించు; నేడ్చు; వి
ఱిఁడియన మాటఁ దొట్రుపడుఁ, బ్రేలును; మాచెలి యేమిచెప్పుదున్

క. ఏమని ధైర్యముఁ జెప్పుదు?
మేమని యౌదార్యవలయు? నేమాడిన యా
యామాటలు గ్రహియింపదే?
భామారత్న ముపచారవాక్యము లనుచున్. ౫౯

క. ఆఁకట్టి నలుగవంకుల
వే కన్నుల నతఁడు నగరి వెలి కెవ్వానిఁ బో
నీకుంటఁ దనయుదంతము
నీ కనుపఁగ రామిఁ బొగులు నెలఁతుక మిగులన్. ౬౦

క. జనియించితి నీకోసమె!
అనన్యమతి ముడుపుగట్టి యౌవనము సమ
ర్పణ సేయనుంటి; మదుపా
యనమును గొని నన్ననుగ్రహము సేయు హరీ! ౬౭

క. హతదైవము నీకంఠో
చితమగు తోమాలియను గసింగొనిన గతిన్
మతిఁబూనెను గై సేయఁగ
నతిసేచపు శుకకంఠ మాలింపు హరీ! ౬౮

గీ. బుద్ధివచ్చిన దాదిఁ ద్రిశుద్ధిగలిగి
యెన్నివ్రతములు తపములెన్నెన్ని గాన
ములు నినుంగోరి ప్రియునిగాఁ బుణ్యపురుష!
ఆచరించితినో! యంతరాత్మ యెఱుఁగు. ౬౯

గీ. వేసె నాభాగ్యవల్లరి వెఱ్ఱితలలు;
వెన్ను వేసెను నాదు జీవితపుఁజెఱకు;
క్రుళ్ళుచున్నది నాప్రేమ రుచిరఫలము;
వ్రతఫలం బిట్లు విపరీతగతులఁ దాల్చె. ౭౦

క. నిను వలచు భక్తురాలను
మనోవచఃకాయములను మాధవ! విసముం
దినిపింతువో? కా కమృతముఁ
దినిపింతువో; నిన్నె నమ్మితిని సత్యముగన్. ౭౧

క. శ్రుతిఁగూర్తును నీ పాటకు
సతతంబు నొనర్తుఁ బాదసంవాహనమున్
ధృతినిత్తును గై దండలఁ;
బ్రతిదినమున నీకు రేయుఁబవళ్ళులను హరీ! ౭౨

క. ఏ పలుకులు పలికితినో?
ఏ పగిదిఁ జరించినానొ? యేది తలఁచితినో?
నీ పయి మదిఁగొని సర్వ
వ్యాపివి సాక్షివి వచింప వ్యర్థముగాదే? ౭౩

క. కొండను వే్రలను దాల్పవె?
కొండికవయి; యిదిగో! విఱుచుకొని పఱచుండెం
గొండయొకటి నాపయి నీ
యండను శరణందితిని దయామతిఁగనవే!" ౭౪

క. ఆ యువతియిట్లు సూత్ర
ప్రాయముగ వచించె ముగ్ధభావంబున నా
రాయణ! దీనికి భాష్య
ప్రాయము నా నోడివియున్న ప్రాక్కథయెల్లన్. ౭౫

క. అనలోద్బంధన జల మ
జ్జనముల మే న్వాయు సాహసముఁ బూను నిఁకన్
వనితామణి; తడసితివే
విను గతజల సేతుబంధ విధమగుఁ బిదపన్. ౭౬

క. సమయంబుగాద యిట మీ
నమేషగణనకు జనార్దనా! 'ఆలస్యా
దమృతం విష'మ్మటంచును
సుమతులు మిముబోంట్లు పలుకుసూక్తిఁ దలఁపుమీ! ౭౭

క. తెలిసితి నామూలాగ్రము
చెలికత; యిది నీదు దివ్యచిత్తమునకుఁ దే
వలె; నినుబోంట్లకు వలయునె
పులుఁగులు కర్తవ్యములను బోధింపంగన్? ౭౮

